శాస్త్రోక్తంగా నిత్య తిరు కల్యాణోత్సవం

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా వైభవంగా జరిపించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతాన్ని ఆలకించి స్వామి, అమ్మవార్లను మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. లక్ష్మీనరసింహస్వామికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి సుదర్శన నారసింహోమం, నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రధానాలయం క్యూ కాంప్లెక్స్‌తోపాటు శివాలయం చెంతన ఉన్న క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగావళి దళార్చనలు నిర్వహించారు. మంగళవారం హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. నాగావళి దళాలతో అర్చన చేపట్టి లలితాపారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడ పప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.13,78,242 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

'మా వాటా మాకే' పుస్తకం ఆవిష్కరణ

వలిగొండలో 'మా వాటా మాకే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీలు, బీసీ సంఘాల నాయకులు

వలిగొండ, ఆగస్టు 13 : ప్రముఖ కవి, రచయిత జూలూరు గౌరీశంకర్ రచించిన 'మా వాటా మాకే' పుస్తకాన్ని మండల కేంద్రంతోపాటు నాగారం, రెడ్లరేపాక, కంచనపల్లి గ్రామాల్లో కుల వృతి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలో నిర్వహించిన పుస్తకావిష్కరణలో మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీలు రాజకీయాలకు అతీతంగా ఏకమై రాజ్యాధికార సాధనకు, చట్టసభల్లో రిజర్వేషన్ సాధనకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండలాధ్యక్షుడు సాయిని యాదగిరి, నాయకులు ఉపేందర్ బోస్, పాండరి, శంకర్‌గౌడ్, ప్రభాకర్, నారాయణ, లింగస్వామి, శ్రీనివాస్, నరహరి పాల్గొన్నారు.

గీత కార్మికులకు 'కాటమయ్య రక్షణ కవచం'

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు

సేఫ్టీ మోకుల వినియోగంపై గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శిక్షణా సిబ్బంది

యాదగిరిగుట్ట, ఆగస్టు 13 : గీత కార్మికులకు వృత్తిలో ప్రమాదాలను నివారించడానికి ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాలను అందిస్తున్నదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు తెలిపారు. యాదగిరిగుట్టలోని యాదగిరిపల్లి కాటమయ్య దేవాలయం వద్ద జిల్లాలో మొదటగా ఎంపిక చేసిన కల్లు గీత కార్మికులకు అందజేసే సేఫ్టీ మోకులతో తాటి చెట్లను ఎక్కే పద్ధతిపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ప్రమాదాలు నివారించడానికి సేఫ్టీ మోకులను ఎలా వాడాలో శిక్షకులతో గీత కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్టు ఎక్కే గీత కార్మికులను ప్రమాదాల బారి నుంచి కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సేఫ్టీ మోకులను అందజేస్తుందన్నారు. నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చి సేఫ్టీ మోకులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి.యాదగిరి, ఆలేరు, మోత్కూరు, భువనగిరి ఎక్సైజ్ సీఐలు దీపిక, రవిచంద్రారెడ్డి, నరేందర్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు, యాదగిరిపల్లి గీత కార్మిక సొసైటీ అధ్యక్షుడు సీస కృష్ణగౌడ్, గీత కార్మిక నాయకులు మచ్చ నరసింహగౌడ్, పరకాల అంజయ్య, బత్తిని భిక్షంగౌడ్, నర్సింహ, వెంకటేశ్, రాజు, చందు, నర్సింహ, గీత కార్మికులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమైక్యతను కాపాడాలి : తాసీల్దార్

తిరంగా ర్యాలీలో పాల్గొన్న తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

ఆలేరు రూరల్, ఆగస్టు 13 : దేశ సమైక్యత, సమగ్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నదని తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆలేరులో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేశ్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేయాలి : సీపీఐ

రామన్నపేట, ఆగస్టు 13 : మండల కేంద్రంలో చేపడతున్న రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గెస్ట్‌హౌజ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్యాల – భువనగిరి రహదారిలో లైట్లు లేకపోవడం, రోడ్డు పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రామన్నపేటను తిరిగి నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వలను పూర్తి చేసి సాగునీరు అందించాలన్నారు. రామన్నపేట దవాఖానను 100 పడకలకు మార్చాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, సహాయ కార్యదర్శి ఎర్ర రమేశ్, నాయకులు సమ్మయ్య, భగవంతం, వెంకటయ్య, మల్లయ్య, కృష్ణ, యాదగిరి, గాలయ్య పాల్గొన్నారు.

వర్కట్‌పల్లి బీపీఎం పోస్టును భర్తీ చేయాలి


ఎంపీడీఓ జితేందర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధి హామీ కూలీలు

వలిగొండ, ఆగస్టు 13 : మండలంలోని వర్కట్‌పల్లి గ్రామంలో ఖాళీగా ఉన్న బీపీఎం పోస్టును భర్తీ చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ వర్కట్‌పల్లి గ్రామంలోని పోస్టాఫీసులో బీపీఎం పోస్టు ఖాళీగా ఉండడంతో ఉపాధి హామీ కూలీలకు ఆరు నెలల నుంచి కూలి డబ్బులు ఇవ్వడంలేదని, పింఛన్‌దారులకు సకాలంలో పెన్షన్లు అందడం లేదని తెలిపారు. బీపీఎం పోస్టును భర్తీ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు చేగూరి నరసింహ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్, ఆగస్టు 13 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. రైతుబంధు, ఆసరా పెన్షన్ల పెంపు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన అమలు కాని హామీలను చూసి ప్రజలు మోసపోయి గోస పడుతున్నారని పేర్కొన్నారు. వారి వైఫల్యాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. పార్టీ నాయకుల సమష్టి నిర్ణయంతోనే స్థానిక సంస్థల అభ్యర్థుల ప్రకటన ఉంటుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, నాయకులు గిర్కటి నిరంజన్‌గౌడ్, పెద్దిటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, దయాకరాచారి, మల్లేశ్ గౌడ్, మాధవరెడ్డి, వెంకటేశం యాదవ్, మల్లేశంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్తిరెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, బాలరాజు, నర్సింహగౌడ్, ఆకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

'మంత్రి పదవి కావాలని అడుగుతున్నావ్.. మీదేం పాలన'

'బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అన్నావు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మీ అన్నకు మంత్రి పదవి ఇచ్చిండ్రు. నాకు మంత్రి పదవి కావాలని అడుగుతున్నావ్.. మరి మీదేం పాలన' అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి మీద ఉన్న ఆరాటం ప్రజా సంక్షేమం మీద లేదన్నారు. మంత్రి పదవి రాకపోతే ఆయన ఏమవుతాడోనని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి తీసుకొచ్చిన రూ.570కోట్లను పూర్తిగా ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. ఇలా అయితే కొన్ని నిధులు వెనక్కిపోయే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి 8నెలలు గడుస్తున్నా కొత్తగా తెచ్చిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఉన్న నిధులనైనా ఖర్చు పెట్టాలని సూచించారు. శివన్నగూడెం, లక్ష్మణాపురం ప్రాజెక్టులు పూర్తయితే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, వాటిపై దృష్టి పెట్టాలని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చౌటుప్పల్, ఆగస్టు 13 : మండలంలోని తూప్రాన్‌పేట వద్ద 65వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన దుడ్డ గురువయ్య (42) కొంతకాలంగా హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ రెహమత్‌నగర్‌లో కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తున్నాడు. విజయవాడలోని తన సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లిన గురువయ్య మంగళవారం హైదరాబాద్‌కు డీసీఎంలో తిరిగి వస్తున్నాడు. తూప్రాన్‌పేట వద్ద డీసీఎం ముందన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన గురువయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 13 : పట్టణంలోని 13వ వార్డులో బొక్క సత్తిరెడ్డి మంగళశారం తన ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా ఆరు కోతులు చుట్టుముట్టి దాడి చేశాయి. సమీపంలో ఉన్నవారు బెదిరించడంతో అవి పారిపోయాయి. దీంతో పెను ప్రమాదం తప్పింది. గాయాలైన సత్తిరెడ్డిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోతుల బెడద నుంచి రక్షించాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరారు.

రాచకొండ తండాలో సారా స్వాధీనం

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 13 : మండలంలోని రాచకొండ తండాలో పోలీసులు మంగళవారం ఓ ఇంటిపై దాడి చేసి ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రయిస్తున్న కరంటోతు అనితపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ తెలిపారు. బెల్టు షాపులు నిర్వహించడం, సారా తయారు చేయడం, అమ్మడం చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

రామన్నపేట, ఆగస్టు 13 : అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను మంగళవారం రాత్రి రామన్నపేట పోలీసులు పట్టుకున్నారు. నార్కట్‌పల్లి మండలం బి.వెల్లెంల గ్రామానికి చెందిన బిజ్జెల రాంబాబు కిరాణా షాపులకు, డబ్బా కొట్లకు సరఫరా చేసే చిప్స్, ఇతర సామగ్రితోపాటు గుట్కాలను తీసుకొని వ్యాన్‌లో భువనగిరి వైపు వెళ్తున్నాడు. రామన్నపేట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా చిప్స్ ప్యాకెట్ల మధ్యలో ఉంచిన నిషేధిత గుట్కా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

రక్తహీనతపై అవగాహన

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 13 : రక్తహీనత, తల్లి పాల ఉపయోగాలపై మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ధనమ్మ, ఆయాలు సునంద, సుజాత, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

- ఆప్కో మాజీ డైరెక్టర్ కర్నాటి వెంకటేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కో మాజీ డైరెక్టర్ వెంకటేశం

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 13 : చేనేత పరిశ్రమ అభివృద్ధి, సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఆప్కో మాజీ డైరెక్టర్ కర్నాటి వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని చేనేత టై అండ్ డై అసోసియేషన్ ఆధ్వర్యంలో చేనేత సమస్యలపై నివేదికను రూపొందించేందుకు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోచంపల్లి ఇక్కత్ చేనేతకు భౌగోళిక గుర్తింపు ఉన్నదన్నారు. పోచంపల్లి డిజైన్లను బడా మిల్లులు కాపీ చేస్తున్నాయని, డూప్లికేట్ చీరెలు రావడంతో చేనేత కార్మికులకు ఉపాధి కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డూప్లికేట్ చీరెలను అరికట్టాలని, చేనేత పరిశ్రమ పరిరక్షణకు రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రింటింగ్ చీరెలను నియంత్రించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. కాటన్ ఫ్యాబ్రిక్ వస్త్రాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయని, దాంతో చేనేత కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని తెలిపారు. సమావేశంలో చేనేత సంఘం రాష్ట్ర నాయకుడు తడక వెంకటేశం, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, గౌరవాధ్యక్షుడు కర్నాటి బాలరాజు, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక రమేశ్, చౌటుప్పల్, కొయ్యలగూడెం చేనేత సహకార సంఘాల అధ్యక్షులు కందగట్ల భిక్షపతి, గడ్డం జయశంకర్, చేనేత నాయకులు, భువనగిరి లోక్‌సభ పరిధిలోని చేనేత ప్రతినిధులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

అడ్డగూడూరులో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ అనూరాధ

అడ్డగూడూరు, ఆగస్టు 13 : మండల కేంద్రంలో వానకాలం పంటల సాగును డీఏఓ కె.అనూరాధ మంగళవారం పరిశీలించారు. పత్తి, వరి పంటలను పరిశీలించి తెగుళ్లు, చీడపీడలపై రైతులకు పలు సూచనలు చేశారు. వానలు సరిగా పడనందున వరి సాగు విస్తీర్ణం బాగా తగ్గిందన్నారు. పత్తి పంటల సాగు ఆశాజనకంగా ఉందన్నారు. రైతులు పంటల తెగుళ్లపై అవగాహన పొంది నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు రైతు వేదిక వద్ద రైతులకు సీఎల్‌డబ్ల్యూ, సీబీఈ యాప్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ అరుణ, ఏఈఓలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : డీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం శ్రీనివాస్

ఆలేరు రూరల్, ఆగస్టు 13 : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీపీఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నిర్వహించిన ఆలేరు మండల సమైక్య 16వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫాం కుట్టడంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు బాగా పనిచేశారని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఏపీఎం మీనా, సీసీలు సరస్వతి, శివకుమార్, సంఘబంధాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు పెంచాలి : ఎంపీడీఓ

సింగారంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 13 : గ్రామ నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు పెంచడంతో పాటు ప్రధాన వీధుల వెంట, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో నాటి సంరక్షించాలని ఎంపీడీఓ రాములు నాయక్ అన్నారు. మండలంలోని సింగారం, పల్లెపహాడ్, కొరటికల్, మోదుగుకుంట గ్రామాల్లోని నర్సరీలను, కంపోస్ట్ షెడ్‌లను మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ రమేశ్, టీఏ యాదిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నరేందర్, సుజాత, శేఖర్, స్వామి ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల ఫోరం మండలాధ్యక్షుడిగా రామకృష్ణ

రాజాపేట : శ్రీనివాస్‌కు నియామక ప్రతాన్ని అందజేస్తున్న ఎంపీఓ కిషన్

ఆలేరు రూరల్, ఆగస్టు 13 : తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం మండల కమిటీని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతకింది రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మంటిపల్లి నరేశ్, ఉపాధ్యక్షురాలిగా మామిడిగల్ల ఇందిర, కోశాధికారిగా కేతావత్ సర్వర్‌నాయక్, సంయుక్త కార్యదర్శిగా కూరెళ్ల తిరుమలాచారి, కార్యవర్గ సభ్యులుగా మీనాబాయి, స్వప్న, శ్రీలత, కనకరాజు, సాయి ఎన్నికయ్యారు. ఫోరం జిల్లా కమిటీ సభ్యులు గణగాని శశికాంత్‌గౌడ్, రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.

రాజాపేట మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్

రాజాపేట : ఎంపీఓ కిషన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్బూరి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా ఎండీ జమీల్, ఉపాధ్యక్షుడిగా ఇంజ దేవమణి, ప్రధాన కార్యదర్శిగా మూడావత్ గాంధీ, సంయుక్త కార్యదర్శిగా బిర్రు పవన్‌కుమార్, కోశాధికారిగా గుజ్జ ఉమేశ్, కార్యవర్గ సభ్యులుగా జ్యోతి, మమత, నజీరొద్దీన్, లక్ష్మణ్, మౌనిక, స్వర్ణ, వెంకటేశ్, సంపత్, సిద్దేశ్వర్ ఎన్నికయ్యారు.

అమ్మవారి బోనాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఎమ్మెల్యే వీరేశానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పద్మశాలి నాయకులు

రామన్నపేట, ఆగస్టు 13 : మండలంలోని వెల్లంకి గ్రామంలో ఈ నెల 19న రాఖీ పౌర్ణమి రోజు నిర్వహించే భద్రావతి అమ్మవారి బోనాలకు హాజరు కావాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి పద్మశాలి సంఘం నాయకులు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కొంగరి జానయ్య మాట్లాడుతూ ఉత్సవాలకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం నాయకులు పున్న రమేశ్, పెద్దులు, భిక్షపతి, గంజి నర్సింహ, అంకం మురళి, శంకరయ్య, సత్యనారాయణ, లక్ష్మయ్య, నరేశ్ పాల్గొన్నారు.

రుణమాఫీ అయిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వాలి

- డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఆగస్టు 13 : రుణమాఫీ అయిన రైతులకు తిరిగి కొత్త రుణాలు త్వరగా ఇవ్వాలని నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన డీసీసీబీ డివిజన్ సమావేశంలో రుణమాఫీ విధి విధానాలపై బ్యాంకు, పీఏసీఎస్ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతులందరికీ పంట రుణాలను త్వరగా అందజేయాలన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్లు అందెల లింగంయాదవ్, మొగలిపాక రామచంద్రయ్య, బ్యాంకు సీఈఓ శంకర్‌రావు, డీఆర్ఓ ఎస్‌డీ హారిణి, ఏజీఎం ఉదయశ్రీ, భువనగిరి పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, పీఏసీఎస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ముఖ్యం

- జిల్లా వైద్యారోగ్య శాఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ప్రీతిస్వరూప్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ప్రీతిస్వరూప్

భువనగిరి అర్బన్, ఆగస్టు 13 : విద్యార్థులకు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమని జిల్లా వైద్యారోగ్య శాఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ప్రీతిస్వరూప్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య శాఖ, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడి నివారణ అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి.. దానిని ఎలా నివారించవచ్చు, మానసిక పరిపూర్ణ వికాసం పెంపొందించుకునే మార్గాలను వివరించారు. చదువు ముఖ్యం కాదని, పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన సర్వం కోల్పోయినట్లు కాదని, ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని సూచించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే మానసిక వికాసం ముఖ్యమన్నారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 1446లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రమణి, కళాశాల ప్రిన్సిపాల్ డి.పాపిరెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఇఫ్తార్, బషీరుద్దీన్ పాల్గొన్నారు.

పిల్లల మనస్సును నిర్బంధించవద్దు

- సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంఏ కరీం

విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సైకాలజిస్ట్ కరీం

భువనగిరి అర్బన్, ఆగస్టు 13 : పిల్లలు చదువులో బాగా రాణించాలంటే వారి మనస్సును నిర్బంధించవద్దని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకాలజ